క్లుప్తంగా

వ్యర్థాలను వీధుల్లో వేయకండి

ప్రత్తిపాడు: వ్యర్థాలను వీధుల్లో వేయకుండా చెత్త డబ్బాలలో ఉంచి క్లాప్‌మిత్రలకు అందించాలని అధికారుల బృందం డీపీఆర్‌సీ ఆర్పీ అనూరాధ తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలపాలెంలో బుధవారం తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి డస్ట్‌బిన్‌లలో ఉంచి క్లాప్ మిత్రులకు అందించడంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానికంగా డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆర్పీలు అనూరాధ, నిరంజన్‌లు మాట్లాడుతూ.. చెత్తద్వారా సంపద సృష్టించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఖాజా, ఏపీఎం లాజర్, ఐటీసీ ఫినిష్ సొసైటీ ప్రతినిధులు యశ్వంత శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి, అంగలకుదురు, వెంగలశాయపాలెం, చేబ్రోలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు సమాచారం అందించాలి



ప్రత్తిపాడు: సర్వే చేసే ముందు ప్రతి రైతుకూ తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించాలని ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే డీవీఎస్ కిషోర్‌బాబు అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురంలో బుధవారం రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూథెనింగ్ ప్రక్రియ మొదలయ్యింది. ఈ నేపథ్యంలో ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే డీవీఎస్. కిషోర్‌బాబు, డెప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే బి.శ్రీనివాసరావులు స్థానిక సర్వేయర్లుతో కలిసి వంగిపురంలో జరుగుతున్న భూముల సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే ఎలా చేస్తున్నారు, ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి, రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలేమిటి.. వంటి వివరాలను మండల సర్వేయర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. వెంట గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

పెదకాకాని: మద్యం మత్తులో కత్తితో దాడి చేసిన సంఘటన నంబూరులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన ఆదంషా, బాబూషా, మెగిలి, గోరిలాల్‌లు బుధవారం సాయంత్రం గ్రామంలోని మద్యం షాపులో మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో వారి మధ్య మాటా మాటా పెరగడంతో ఘర్షణకు దారి తీసింది. గ్రామంలోని ఆసుపత్రి సెంటర్‌కు చేరుకున్న క్రమంలో వారిలో మెగిలి అనే యువకుడు కత్తితో బాబూషాపై దాడి చేశాడు. కొద్దిసేపు ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ ఘర్షణ వాతావరణం సృష్టించారు. అనంతరం కత్తిదాడికి గురైన వ్యక్తిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

9న జిల్లా స్థాయి చదరంగం పోటీలు



నగరంపాలెం: భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్, ఇంటాక్ గుంటూరు జిల్లా చాప్టర్ సంయుక్తంగా ఈ నెల తొమ్మిదిన 15 ఏళ్ల లోపు బాల, బాలికలకు జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు భారతీయ విద్యా భవన్ గుంటూరు కేంద్ర కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని భారతీయ విద్యాభవన్లో బుధవారం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్‌లోని శ్రీబొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మేధను పెంపొందించేందుకు, మానసిక, వ్యక్తిత్వ వికాసానికి చదరంగం క్రీడ దోహదపడుతుందని అన్నారు. ఇంటాక్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీ ఆనంద్ చెస్ అకాడమీ నిర్వాహకులు గోపి మాట్లాడారు. మరిన్ని వివరాలకు 9703049378, 9124519444 సంప్రదించాలని కోరారు.

కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలి

లక్ష్మీపురం: కోడిగుడ్డు సత్రం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. వసతి గృహాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ప్రారంభానికి నోచుకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణం పూర్తయినప్పటికీ విద్యార్థులకు మాత్రం అందుబాటులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటంతో డిసెంబర్‌లోనే ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ విద్యార్థులు వందలాదిమంది చదువుకోవాల్సిన హాస్టల్ ఖాళీగా ఉండటం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులకు హాస్టల్‌లో వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఏ యశ్వంత్, ఉపాధ్యక్షులు సుభాని, బి.రాకేష్ సుభాష్ పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజాగళం



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న అంబటి మురళీకృష్ణ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బలసాని, అయిదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు

- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు వెన్నుపోటు దినోత్సవం
- భారీగా నిర్వహించిన సమావేశాలు, ర్యాలీలు
- కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తిన నియోజకవర్గ నాయకులు

పొన్నూరు: నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. నీకు రూ. 18 వేలు అని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు అమలుకు నోచుకోని మోసపూరిత హామీలను ప్రస్తావిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చేసిన నినాదాలతో పొన్నూరు పట్టణం హోరెత్తింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పొన్నూరులో వెన్నుపోటు దినం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అబద్ధపు హామీలతో సీఎం చంద్రబాబు మోసం చేశారని.. ఆయన మాటలు మళ్లీ నమ్మి ఓటేసి మోసపోయామని ప్రజలు నిరసనలో గళమెత్తారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి సూపరింటెండెంట్ రామారావుకు నాయకులతో కలిసి అంబటి మురళీకృష్ణ వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది..

కూటమి పాలనలో ప్రస్తుతం అవినీతి, అక్రమాలు, మోసం, నయవంచన, కుట్ర, పగ, వెన్నుపోటు, కక్షపూరిత రాజకీయం రాజ్యమేలుతుందని అంబటి మురళీకృష్ణ అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని మాజీ సీఎం వైఎస్ జగన్ అండగా ఉంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్.సైపుల్లా, ఎంపీపీలు భవనం పద్మలీల, సాహితీ కిరణ్, జెడ్పీటీసీ బత్తుల అనురాధ, గోవిందరాజులు, సర్పంచులు బొనిగల నాగ మల్లేశ్వరరావు, చుండూరు వీరయ్య, పొన్నూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకట సుబ్బయ్య, రుద్రపాటి ఆదిశేషు, అమరయ్య, ఆకుల రామ్మోహన్, అంబటి వెంకటేశ్వరరావు, వట్టిప్రోలు రంగారావు, షేక్.మాము, అమిరినేని సాంబశివరావు, గేరా సంజీవ్, దేవరకొండ గోపి, బోనిగల రాజారావు, బొనిగల వేణుప్రసాద్, లంకపోతు పిచ్చిరెడ్డి, చింతలపూడి మురళీకృష్ణ, పిల్లి మాణిక్యరావు, ముడియాల మల్లికార్జునరెడ్డి, ఉయ్యూరు సతీష్‌రెడ్డి, ఆలా శ్రీనివాసరెడ్డి, మందాల శివారెడ్డి, ఆత్మకూరి శేషిరెడ్డి, కొండమడుగుల వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మేరీ సుబ్బారావు, లంకపల్లి శ్రీను, మండ్రు అనిత, భీమవరపు విజయలక్ష్మీ, బ్రహ్మారెడ్డి, అన్నపరెడ్డి అయ్యప్పరెడ్డి, ఆళ్ల శ్రీరామిరెడ్డి, అల్లం వెంకట్రామయ్య, కె.శేషిరెడ్డి, శ్రీరెడ్డి, అనిత, షేక్. షర్మిల, సుషోబిత, లీలారాణి, జ్యోతి, మాజీ కౌన్సిలర్లు గేరా కుమారి, అనిలా కుమారి, షేక్ షర్మిల, మండ్రు అనిత, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో పోటెత్తిన పార్టీ శ్రేణులు

బాబు పాలనలో కక్ష సాధింపు రాజకీయాలు..

పొన్నూరు కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోయిందన్నారు. బాబు చేసిన మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్‌తో పాటు 140 హామీలు ఇచ్చి అమలు చేయక వాటిని తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. ఏడాది పాలన పూర్తయినా ఇప్పటికీ ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. కక్ష సాధింపు రాజకీయాలకు బాబు తెరలేపారని ఆయన మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తే.. కూటమి పాలనలో విద్యా వ్యవస్థకు కష్టకాలం వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేశారు.

ప్రత్తిపాడు: అమలు కాని హామీలను ఎందుకు ఇచ్చావ్ బాబు అంటూ అన్నదాతలు.. చంద్రన్నా ఉచిత బస్సు ఎక్కడన్నా అంటూ అక్కచెల్లెమ్మలు.. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు చంద్రం సారూ అంటూ నిరుద్యోగ యువత.. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు ఎటు పోయాయంటూ అనేక వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన మోసాలు, అన్యాయాలు, అరాచకాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత బస్టాండు సెంటరులోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రావ్, పాతమల్లాయపాలెం సెంటరులోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహాలకు బలసాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ఇందిరాగాంధీ బొమ్మ సెంటరు నుంచి అంకమ్మగుడి సెంటరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.కరుణకుమార్‌కు బలసాని కిరణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

దళితులపై అరాచకాలు..

ప్రత్తిపాడు కార్యక్రమంలో బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. కూటమి పాలన ఏడాది కాలంలో అరాచకాలు, వైసీపీ శ్రేణులపై వేధింపులు, కార్యకర్తలపై కేసులతో క్రూరమైన పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ దళితులపై అరాచకాలకు పాల్పడుతున్నారని.. అందుకు సాక్ష్యమే ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు మండలం గారపాడులోని మాదిగపల్లెలో జరిగిన ఘటనన్నారు. అక్కడున్న వారిని టీడీపీ నాయకుల వేధింపులకు గురి చేసి, పోలీసులతో దారుణంగా కొట్టించి 10 కుటుంబాలు ఊరు వదిలి వెళ్లేలా చేశారని మండిపడ్డారు. పాలనను పక్కనబెట్టి కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. అధికారంలోనికి వచ్చిన సంవత్సరంలో సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, చల్లా హనుమంత్‌యాదవ్, మన్నవ వీరనారాయణ, నల్లమోతు శివరామకృష్ణ, ఖాశింపీరా, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



పొగాకును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వెనిగండ్ల గ్రామంలో రైతులు పండించిన పొగాకు పంటను సీపీఐ సహాయ కార్యదర్శి సొలస వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొల్లిరంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్ల నుంచి రైతులు ఏ పంట పండించినా గిట్టుబాటు ధర రావడంలేదని అన్నారు. దీనికి తోడు ఐటీసీ జీపీఐ అలవెన్స్ వంటి కంపెనీలు సీడ్స్ విత్తనాలను రైతులకు అందించి, మీరు పండించిన పొగాకును మేమే కొంటామని హామీ ఇచ్చారని.. దీంతో రైతులు అప్పులు చేసి మరీ సుమారు 120 వేల హెక్టార్లలో పొగాకు పంట పండించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ఏజన్సీల ద్వారా నల్లబర్లీ, వైట్ బర్లీ పొగాకులను రూ.18 వేలకు కొనుగోలు చేసి రైతు, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని కోరుతూ గుంటూరులో జీపీఐ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, చెన్నారెడ్డి, వెంకటప్ప రెడ్డి, పాములు దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

పెదకాకాని: సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చని ఆయిల్ పంప్ శాస్త్రవేత్త డాక్టర్ శివశంకర్ అన్నారు. వికసిత కృషి, సంకల్ప అభియాన్ కార్యక్రమంలో బుధవారం ఉప్పలపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని భాగం చేయడం ద్వారా రైతులు సరైన లాభాలు పొందవచ్చని సూచించారు. డాక్టర్ సౌజన్య లక్ష్మి మాట్లాడుతూ.. కేవలం వ్యవసాయమే కాకుండా వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను అనుసంధానం చేసుకోవడంతో రైతులు మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకునేందుకు దోహదం అవుతుందని వివరించారు. మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ.. అపరాల సాగుతో భూసారాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. అనంతరం కిసాన్ సారథి కాల్ సెంటర్ యాప్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ మొదలైన అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రోన్ పనితీరును రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూస్సాబు, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో యోగా శిక్షణ



ప్రత్తిపాడు: చుట్టూ పచ్చని మొక్కలతో హరితవనంలా ఆహ్లాదంగా కనిపిస్తున్న ఈ ప్రదేశం పార్కు కాదు. ఇది ఘన వ్యర్థాల నుంచి సంపద తయారు చేసే కేంద్రం. అదేనండీ డంపింగ్ యార్డు. ఇంత పచ్చగా హరిత వర్ణంలో ఉంది కాబట్టే ఈ సెంటర్‌ను జిల్లాలోనే సుప్రీం ఎల్‌టీసీగా ఎంపిక చేశారు. కాగా ఇక్కడ బుధవారం యోగ శిక్షణను నిర్వహించారు. గ్రామంలో ఆసక్తి ఉన్న పలువురు యోగాసనాల్లో పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన మోదీ

సీపీఐ నాయకుడు అజయ్ కుమార్

లక్ష్మీపురం: నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత పేదలు నానా అవస్థలు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానని ధరలు విపరీతంగా పెంచారని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి రైతులు పూర్తిగా నష్టపోయే విధంగా చట్టాలు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న అనేక హక్కుల్ని కాల రాస్తున్నారని మండిపడ్డారు. 44 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల ఉసురుపోసుకున్నారని అన్నారు.

విజ్ఞాన్ విద్యార్థినికి పీహెచ్‌డీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగానికి చెందిన విద్యార్థిని బత్తెన త్రివేణికు బుధవారం వర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. 'సమ్ ప్రాబ్లమ్స్ ఆన్ కన్వెక్టివ్ బౌండరీ లేయర్ ఫ్లో ఆఫ్ నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచ్చింగ్ షీట్' అనే అంశంపై విద్యార్థిని పరిశోధన చేసిందని తెలియజేశారు. ఈమెకు విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునగాల వెంకట సుబ్బారావు గైడ్‌గా వ్యవహరించారు. త్రివేణి తన పరిశోధనలో భాగంగా మొత్తం 3 ఎస్‌సీఐ పేపర్స్‌ను పబ్లిష్ చేశారని తెలియజేశారు. డాక్టరేట్ పొందిన బత్తెన త్రివేణిను చైర్మన్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపకులు అభినందించారు.

క్రీడా దుస్తులు బహూకరణ



లక్ష్మీపురం: సీఆర్ పార్క్ ఎక్సర్‌సైజ్ వారియర్స్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా క్రీడా దుస్తులను కమిటీ సభ్యులు చందోలు శివ బహూకరించారు. స్థానిక కృష్ణానగర్‌లోని కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పార్క్‌లో వారియర్స్ కమిటీ ద్వితీయ వార్షికోత్సం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారియర్స్ కమిటీ అధ్యక్షుడు ఆదమ్స్ సుమారు 50 సంవత్సరాలు పై బడిన పురుషులు, మహిళలు అందరూ గత రెండు సంవత్సరాలుగా ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఉచితంగా సభ్యులకు ఎక్సర్‌సైజ్‌లు నేర్పించడం జరుగుతుందన్నారు. ఒక కమిటీగా ఏర్పడి పార్కు అభివృద్ధితో పాటుగా సమాజానికి అవసరమైన పరిస్థితులలో తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. సీఆర్ పార్క్ ఎక్సర్‌సైజ్ వారియర్స్ కమిటీ సెక్రెటరీ రామచంద్రుడు, కమిటీ సభ్యులు షేక్.బాబు తదితరులు పాల్గొన్నారు.

వేలాదిగా తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బలసాని

గుంటూరు రూరల్: వెన్నుపోటు దినం సందర్భంగా చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ప్రత్తిపాడులో నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి రూరల్ మండలం నుంచి మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇన్‌చార్జి బలసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రంలో ప్రత్తిపాడు మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన చల్లా హనుమంత్ యాదవ్ స్థానిక పాతమల్లాయపాలెం సెంటరు సమీపంలో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు బి.వెంకటేశ్వరరెడ్డి, జి.పరమారెడ్డి, బి.వెంకటరమణ, పిల్లి మేరీ, వి.లక్ష్మారెడ్డి, డి.చెంచురామారావు, జి.శివారెడ్డి, యు.ఓంప్రకాష్‌రెడ్డి, వి.అమృతయ్య, బి.గోవిందొరెడ్డి, సీహెచ్ లక్ష్మణ, కె.కృష్ణారెడ్డి, పిల్లి మేరీ, ఖాశింపీరా, ఎస్.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయం

మేయర్ రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్: క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయంగా నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్, కార్పొరేటర్లు, నోడల్ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గుంటూరు నగరంలో వార్డుల వారీగా కార్పొరేటర్లకు మొక్కలు, గుడ్డ సంచులను నగరపాలక సంస్థ నుంచి అందిస్తున్నామని చెప్పారు. ఆయా వార్డులలో కార్పొరేటర్ల ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేసుకుంటూ మొక్కలు నాటటం, గుడ్డ సంచులు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పొరేటర్ల భాగస్వామ్యం పెరగాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఈ సీజన్‌కి ఐదు లక్షల మొక్కలు నాటేలా వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. అదే విధంగా ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు గుడ్డ సంచులను అందించేలా గాంధీ పార్కు, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర వెండింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ అందిస్తామని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా గురువారం స్థానిక కన్యక పరమేశ్వరి అమ్మవారి గుడి దగ్గర నుంచ హిమని సెంటర్ వరకు మాస్ క్లీనింగ్ చేస్తూ, పర్యావరణ పరిరక్షణపై అవగాహనా ర్యాలీ జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్ఈ నాగామల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డెప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు

నగరంపాలెం: స్థానిక నాజ్ కూడలిలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు కళాదర్బార్- ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), కళా దర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, గాయని, గాయకులు ఆయన కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాదర్బార్ సభ్యులు భానుప్రకాష్, పగడాల వేణుగోపాల రావు, సిరిపురపు శ్రీధర్, సత్తార్, గాయని, గాయకులు మిరియాల ప్రసాదరావు, కంబాల బాబురావు, సుధీర్, అబ్దుల్ ఖాదర్ ఇస్మాయిల్, రాధానాయుడు, సేవాసదన్ అధ్యక్షులు మిరియాల గోపి, జమదగ్ని పాల్గొన్నారు.

గాన గాంధర్వుడు ఎస్పీ బాలుకి నివాళి

లక్ష్మీపురం: గాయకులుగా ఎన్నో పాటలకు జీవమూ అందించి నటుడిగా విలక్షణత ప్రదర్శించి, సంగీత దర్శకునిగా అపూర్వమైన ప్రయోగాలు చేసిన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు ప్రజలకు ఆరాధ్యుడని సంగీత విద్వాంసులు గాయకులు వి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఎస్పీ బాలు జయంతి బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.